

# హైదరాబాద్ వార్త

## ట్యాంక్‌బండ్‌పై పెద్ద విగ్రహాలకు మాత్రమే అనుమతి: సిపి అంజనీకుమార్



హైదరాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : వినాకయ నిమజ్జనాల సందర్భంగా కేవలం పెద్ద విగ్రహాలకు మాత్రమే ట్యాంక్ బండ్‌కు అనుమతి ఉంటుందని నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ స్పష్టం చేశారు. సోమవారం ట్యాంక్‌బండ్‌పై సుందరీకరణ దెబ్బ తినకుండా పోలీసులు ట్రయిల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లను సిపి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. త్వరగా నిమజ్జనం చేసేందుకు ఆటోమేటిక్ ఐడల్ రిలీజ్ సిస్టమ్‌ను వాడుతున్నామని వెల్లడించారు. ట్యాంక్‌బండ్‌పై వినాయక నిమజ్జనానికి పోలీసులు చేస్తున్న ఏర్పాట్లను సిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్‌పై సుందరీకరణ దెబ్బతినకుండా పోలీసులు ట్రయల్ రన్ నిర్వహించారు. ట్యాంక్‌బండ్‌పై ఈసారి క్రేన్ల సంఖ్య తగ్గిస్తున్నామని తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై 16, ఎన్టీఆర్ మార్గ్‌లో 12, పీపుల్స్ ప్లాజాలో 8 క్రేన్లను ఏర్పాటు చేస్తున్నామని సిపి వివరించారు.



## గృహా వ్యర్థాలతో ఆకర్షణీయమైన బొమ్మల తయారీ

నాంపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : గృహావ్యర్థాలను రీసైక్లింగ్ కోసం వీలుగా వుండే ప్లాస్టిక్, ఇతర ఈ-వ్యర్థాలను మున్సిపాలిటీ చెత్తబుట్టలో వేయకుండా సరైన రీతిలో రీసైక్లింగ్‌కి పంపడం ద్వారా మనం పర్యావరణ పరిరక్షణకు తోడ్పడమే కాకుండా ఆకర్షణీయమైన బొమ్మల తయారీకి ఉపయోగించవచ్చని స్వచ్ఛత సారథి ఫెలోషిప్ 2021-22 సారథ్యంలో వేస్ట్ టు వెల్త్ మిషన్‌లో భాగంగా స్ఫూర్తి థియేటర్ ఫర్ ఎడ్యుకేషనల్ పిప్పెట్రీ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పద్మిని రంగ రాజన్ అన్నారు. ఈ ఆలోచనకు అంబర్‌పేట్‌లోని పలు అపార్టు మెంట్స్‌కి చెందిన సుధా నీలంరాజు, అర్చన గౌరీకర్ తదితరులు నాంది పలికారు.